క్లుప్తంగా

వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ...

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వాగులపై వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, 'సాక్షి' దినపత్రికలో 'ఎన్నాళ్లీ కష్టాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మందమర్రి మండలంలోని శంకర్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పాలవాగు నిర్మాణం కోసం రూ. రెండున్నర కోట్లు, అందుగులపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రాళ్లవాగుపై వంతెన నిర్మాణం కోసం రూ. మూడు కోట్లు, పులిమడుగులోని వాగుపై వంతెన నిర్మాణం కోసం రూ. మూడు కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కథనంతో వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి' దినపత్రికకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బాల్క సుమన్ కృషితో మండలంలోని అక్కెపల్లి గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెన, చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.3.20కోట్ల నిధులు మంజూరు చేసినందుకు గాను సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆదివారం ప్రజలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దింటి రాజన్న, ప్రజలు పాల్గొన్నారు.

మెగా హెల్త్‌క్యాంప్‌నకు స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మెడిలైఫ్ ఆసుపత్రిలో ఆదివారం గొంగల్ల శంకర్ మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపునకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ విఠల్, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన సన్‌షైన్, కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీధర్ కస్తూరి పర్యవేక్షణలో ఉచితంగా వైద్య పరీక్షలు చేపట్టారు. గుండె, కిడ్నీ, ఛాతీ, నరాలు, ఎముకలు, గైనకాలజిస్టు, కాలేయ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు, మెడిలైఫ్ ఆసుపత్రి వైద్యుడు కుమారస్వామి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.80
పచ్చిమిర్చి	80
చిక్కుడు కాయ	70
బీరకాయ	50
వంకాయ	60
కాకరకాయ	80
బెండకాయ	40
అలసంద	50
దొండకాయ	40
సోరకాయ	30
ఆకుగోబి	50
పూగోబి	70
బోడకాకర	200
పాలకూర	30
తోటకూర	30
ములక్కాయ	60
గోరుచిక్కుడు	60

- మంచిర్యాలఅగ్రికల్చర్



హంగులతో ఆరోగ్య కేంద్రం

- ప్రారంభోత్సవానికి సిద్ధమైన చెన్నూర్ సీహెచ్‌సీ
- 30 పడకల సామర్థ్యంతో రూ.7కోట్లతో నిర్మాణం
- నాలుగు మండలాల ప్రజలకు అందుబాటులో సేవలు
- ఈ నెలాఖరులో ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు



చెన్నూర్‌లో నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రం

చెన్నూర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ కేంద్రంలో రూ.7కోట్ల నిధులతో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న 30పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ముహూర్తం కుదిరితే ఈ నెలాఖారునాటికి నూతన ఆసుపత్రి భవనం ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

తీరనున్న కష్టాలు..

చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రంతో చెన్నూర్ మండలంతో పాటు కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాల రోగులకు కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. గతంలో చెన్నూర్‌లో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ రూ.7కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో పాత ఆసుపత్రి భవన స్థలంలోనే కొత్త భవన నిర్మాణం చేపట్టడంతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని చెన్నూర్ మండలంలోని ఎల్లక్కపేట సింగరేణి డిస్పెన్సరీకి మార్చారు. డిస్పెన్సరీలో గదుల కొరత కారణంగా సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బందులు పడ్డారు. చెన్నూర్ పట్టణ రోగులు సైతం ఎల్లక్కపేటలో గల ఆసుపత్రికి వెళ్లాలంటే 5కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి. ఆటోకు వెళ్లే రాను పోను రూ.100ఆర్థిక భారం పడింది. దీంతో కొంతమంది రోగులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించారు. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల రోగులకు మెరుగైన వైద్య సేవల కోసం మంచిర్యాల, కరీంనగర్ పట్టణాలకు తరలివెళ్లారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ప్రైవేట్‌ను ఆశ్రయించి రోగులు ఆర్థికంగా నష్టపోయారు. ఆధునిక హంగులతో 30పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి కావడంతో పాటు త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా ఈ ప్రాంత ప్రజలు దూర భారంతో పాటు ఆర్థిక భారం తగ్గనుంది.

మెరుగు పడనున్న సౌకర్యాలు..

చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోకి మారిన విషయం తెలిసిందే. దీంతో రోగులకు వైద్య సేవలందించేందుకు సౌకర్యాలు మెరుగు పడనున్నాయి. ఇప్పటికే చెన్నూర్‌కు మంజూరైన ఐదు డయాలసిస్ యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు స్కానింగ్ సెంటర్, ఎక్స్‌రే లాంటి సౌకర్యాలు నిరుపేద రోగులకు ఖర్చు లేకుండా ఉచితంగా అందనున్నాయి.

పూర్తయితే మేలు..

తర్వగా 30పడకలు పూర్తయితే మంచిర్యాలకు వెళ్లే బాధ తప్పుతుంది. ఇక్కడ ఆసుపత్రి ఉన్నా, సౌకర్యాలు లేకపోవడంతో డెంగీ జ్వరాలు వస్తే మంచిర్యాలకు వెళ్తే లక్షలకు లక్షలు బిల్లులు వేస్తున్నారు. గరీబోళ్లకు రోగం వస్తే అప్పులపాలే. చెన్నూర్‌లో కొత్త ఆసుపత్రి నిర్మాణంతోనైనా ఈ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుంది. ఆసుపత్రి పనులు మాత్రం స్పీడుగా నడుస్తున్నాయి.

- నాగేశ్వర్‌రావు, స్థానికుడు

పనులు పూర్తయ్యాయి

ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఈ నెల 20నాటికి భవనాన్ని అప్పగిస్తాం. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సమయం ఇస్తే.. ఈ నెలలోనే ప్రారంభించేందుకు ఆసుపత్రి భవనాన్ని సిద్ధం చేస్తున్నాం.

- నర్సింగరావు, టీఎస్‌ఎంఐడీసీ, డీఈ

గొర్రెల పంపిణీతో యాదవులకు లబ్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



గొర్రెలు అందజేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: యాదవులలో ఆర్థిక పరిపుష్టి పెంచేందుకు సీఎం కేసీఆర్ సబ్సిడీపై గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని మురిమడుగు గ్రామంలో ప్రభుత్వం నుంచి అందిస్తున్న రెండో విడుత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఆదివారం గొర్రెలను అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధిలో వెనక్కి నెట్టివేయబడితే, తెలంగాణ ఏర్పాటయ్యాక బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలు అన్ని హంగులతో అభివృద్ధిలోకి వచ్చాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, అన్ని కుల వృత్తుల వారికి ప్రభుత్వం చేయూత నందిస్తుందన్నారు. సమావేశంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఏఎంసీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు శీలం రమేశ్, రాజన్న, ఏఎంసీ డైరెక్టర్లు నర్సగౌడ్, రజాక్, నాయకులు రవి, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతోనే చేరికలు

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



పార్టీలోకి చేర్చుకుంటున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరుతున్నారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో 9వ వార్డు పాతమంచిర్యాలకు చెందిన 40మంది వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్ పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం



కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులు

బెల్లంపల్లి: మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని తాపీ సంఘ భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నల్ల సతీష్ పర్యవేక్షణలో కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోషియేషన్ బెల్లంపల్లి మండల గౌరవ అధ్యక్షుడిగా కుంబాల రాజేష్, గౌరవ సలహాదారులుగా కాంపల్లి శంకర్‌బాబు, ఆకునూరి రాజ్‌కుమార్, ధర్మేంధర్, పట్నం చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నస్పూరి సందీప్, అధ్యక్షుడిగా ఆకుల వేణు, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా కాంపల్లి విజయ్, సహాయ కార్యదర్శులుగా కోనేరి శంకర్, అడిచెర్ల మహేష్, కోశాధికారిగా మడుపు విక్రమ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో నలుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. కొత్తగా ఎంపికైన కమిటీని పలువురు అభినందించారు.

కోరుట్లకి తరలివెళ్లిన పద్మశాలీలు



భీమారం నుంచి తరలివెళ్తున్న పద్మశాలీలు

భీమారం: రాజ్యాధికార సాధన కోసం కోరుట్లలో ఆదివారం నిర్వహించిన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరీకి భీమారం మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు గుడిమల్ల వెంకటేశ్ మాట్లాడుతూ.. అన్ని కులాలు రాజకీయంగా ఎదుగుతున్నా, కేవలం పద్మశాలీలు ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో రాజ్యాధికార సాధనే లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమానికి అనూహ్యస్పందన లభిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో పెద్ద ఎత్తున పద్మశాలీల నుంచి అభ్యర్థులు రంగంలోకి దిగుతారన్నారు.

తాండూర్: కోరుట్లలో జరిగిన పద్మశాలీల రాజకీయ యుద్ధభేరి సభకు ఆదివారం పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దికుంట రామ్‌చందర్ ఆధ్వర్యంలో తాండూర్ మండలం నుంచి పద్మశాలీలు తరలివెళ్లారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

వేమనపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రూ.35లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ కోలి స్వర్ణలత, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్, స్థానిక సర్పంచ్ కుబిడె మధుకర్ ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేషం, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేషం, కో ఆప్షన్ సభ్యుడు జాహెద్‌అలీ, నాయకులు లక్ష్మీకాంత్, లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ గుమ్ముల సత్యం తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాహితం కోరేది కాంగ్రెస్‌పార్టీనే'



బెల్లంపల్లి: కరపత్రం అందజేస్తున్న దుర్గా భవానీ

బెల్లంపల్లి: ప్రజాహితం కోరి ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యమయ్యేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చొప్పదండి దుర్గాభవానీ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ కాంటా చౌరస్తా, కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఆదివారం ఆమె గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పురవాసులకు బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాల గురించి అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేసి, ఇంటి తలుపులపై స్టిక్కర్లు అంటించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు వినోద్, దేవమ్మ, బబ్లు, మహేందర్, నరేష్, గణేష్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పల్లెల అభివృద్ధి

కాసిపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పల్లెల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ తెలిపారు. రెండో రోజు ఆదివారం కొత్తగూడ, జెండాగూడ, సాలేగూడ, దొడ్డిగూడ, సోనాపూర్, లక్ష్మీపూర్, కుర్రేఘాట్, వెంకటాపూర్ గ్రామాలలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మొదటి రోజు గట్రామ్‌పల్లిలో రాత్రి బస చేసి, రెండో రోజు యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రొడ్డ శారద, ముడిమడుగుల మహేందర్, నాతరి స్వామి, ఎంపీటీసీలు భీంరావు, పార్వతి మల్లేష్, మాజీ సర్పంచ్‌లు ప్రభాత్‌రావు, జాడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నెన్నెల: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, రాష్ట్ర మహిళా కార్యదర్శి చొప్పదండి భవాని అన్నారు. నెన్నెలలో గడపగడపకూ తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. వాడవాడల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు వినోద్, బబ్లు, దేవమ్మ, రవి, గోవింద్, జాని, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని పలువురు కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. సుమారు రెండు వందల మంది కార్యకర్తలు పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, నాయకులు చిన్నన్న, రాజు, మండలాధ్యక్షులు పింగిళి రమేష్, శ్రీనివాస్, హాజీ, కిషన్ పాల్గొన్నారు.





ప్రమాదం జరగకముందే.. స్పందించండి!



చెన్నూర్: మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా పయనిస్తున్న తరుణంలో తాగునీటి తిప్పలు తప్పడం లేదు. తాగునీరు కావాలంటే మోటార్ ఆన్ చేసేందుకు కర్రల సాయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో తాగునీటి వనరులు లేకపోవడంతో కాలనీవాసులు బోరు నీటి పైనే ఆధాపడాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీలో మోటార్‌కు ఏర్పాటు చేసిన స్టార్టర్ చెడిపోయింది. పలుమార్లు అధికారులు చెప్పినా.. పట్టించుకోవడం లేదు. దీంతో నీళ్ల కోసం యువకులు కర్రలతో రెండు విద్యుత్ వైర్లను జతచేయాల్సి వస్తుంది. విద్యుత్ వైర్లను కలిపే సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం లేకపోలేదు. ప్రమాదమని తెలిసినా, కాలనీ వాసులకు కష్టాలు తప్పడం లేదు. అధికారులు స్పందించి వెంటనే కొత్త స్టార్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకుంటలేరు..!



కోటపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం పక్కన మురుగు నీరు నిలిచి అధ్వానంగా ఉంది. గ్రామాల్లో పారిశుధ్యం తొలగిస్తున్నామని గొప్పలు చెప్పుకునే అధికారులు.. తమ కార్యాలయం చుట్టూ అపరిశుభ్ర వాతవరణం ఏర్పడినా పట్టించుకోవడంలేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఎంపీడీఓ కార్యాలయం పక్కనే క్వార్టర్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి దుర్గంధం వెళ్లే మురుగునీరుతో నిండిపోయింది అయినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పలువురికి ఆదర్శంగా ఉండాల్సిన అధికారులే ఇలా మురుగు నీరుపై అశ్రద్ధ చూపడంపై పలు విమర్శలు వెల్లువెత్తున్నాయి. గతంలో కూడా క్వార్టర్స్ కాలనీవాసులు పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారులు చొరవ చూపకపోవడం ఏంటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్లపైనే పశువుల సంచారం





నెన్నెల: మండల కేంద్రంలో నిత్యం రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పశువుల సంచారం సర్వసాధారణమైంది. రోడ్డుపై నుంచి వాహనాల్లో వెళ్లే వారు భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్య రహదారుల మధ్యలోకి పశువులు రావడంతో వాహనచోదకులకు అవరోధాలుగా నిలుస్తున్నాయి. పశువులు రోడ్లపై సంచరించడంతో రహదారులు పశుసంచార కేంద్రాలుగా మారుతున్నాయి. రోడ్లపై పశువులు సంచరిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారు. ఆచరణలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. స్థానికంగా పశువుల దొడ్డి ఉన్నప్పటికీ అధికారులు చొరవ చూపకపోవడంతో నిర్వహణ అదుపు తప్పుతుంది. రాత్రి వేళల్లో వాటర్‌ప్లాంట్ ముందు హన్మాన్ మందిరం వద్ద, శివాలయం సమీపంలో, ఆటో స్టాండ్, గొల్లవాగులలో రోడ్లపై పశువులు రోడ్డుకు అడ్డంగా పడుకుంటున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో పశువులు కనబడక తగిలి కిందపడ్డ సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకొని, వాటిని బంజరుదొడ్డికి తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు అంటున్నారు.

సంక్షిప్త వార్తలు

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

వేమనపల్లి: మండలంలోని కొత్త కాలనీకి చెందిన గొర్లపల్లి మాజీ సర్పంచ్ అదె భీమయ్య(82) అనారోగ్యంతో మృతి చెందాడు. 1986 నుంచి 1990వరకు గొర్లపల్లి సర్పంచ్‌గా పని చేశారు. కొద్ది రోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుడి కుటుంబాన్ని ఎంపీటీసీలు సంతోష్‌కుమార్, చంద్రకళ, శంకర్, సర్పంచ్ పద్మ-మొండి, మాలీ సంఘం నాయకులు మోర్ల రమేష్, జనార్దన్ పరామర్శించారు.

ఏబీవీఎస్‌యూ జిల్లా కార్యదర్శిగా ప్రశాంత్

బెల్లంపల్లి: అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా నూతన కార్యదర్శిగా ప్రశాంత్ నియామకమయ్యారు. నిజామాబాద్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రశాంత్‌ను కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు సాగించి, సంఘాన్ని బలోపేతం చేయడానికి ప్రశాంత్ కృషి చేస్తారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశాభావం వ్యక్తం చేశారు.

రక్తదానం చేసి.. మానవత్వం చాటి

పాతమంచిర్యాల: ప్రాణాపాయ స్థితిలో ఉన్న కిడ్నీ పేషెంట్‌కు రక్తం అవసరం కాగా, పీఎస్‌ఆర్ యూత్ సభ్యుడు మహ్మద్‌సాధిక్ రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు.

గుంత.. ప్రయాణికుల చింత



మంచిర్యాల టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి సమయంలో ఇక్కడ గుంత ఉన్నట్లుగా కనిపించక పోవడంతో, వాహనదారులు తరుచూ కింద పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.